ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భూ ఆక్రమణలకు ముగింపు పలికేలా నూతన చట్టాన్ని తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శాసనసభలో ప్రకటించారు.
- ❖ మున్సిపాలిటీలలో కొత్తగా పన్నులు విధించడం లేదని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.
- ❖ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రతిపాదన లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు.
- ❖ భారత నావికాదళంలో విశేష సేవలందించిన UH3H హెలికాప్టర్ ను విశాఖలో మ్యూజియంగా ఏర్పాటు చేస్తున్నారు.
- ❖ త్వరలో నూతన టెక్స్ టైల్స్ విధానాన్ని తీసుకుని వస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు.

======================

భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాసన సభలో ఈ రోజు భూ ఆక్రమణలకు విషయంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేసి నూతన చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఈ చట్టంలో శిక్షలతో పాటు జారీమానా విధింపులో మార్పులు తెచ్చామన్నారు. ఒకసారి భూ ఆక్రమణలకు పాల్పడితే జైలుకు వెళ్లేలా ఈ చట్టంలో నిబంధనలు చేర్చామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రతిపాదన ఏదీ లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై శాసన మండలిలో ఈ రోజు చర్చ జరిగింది. ఈ సందర్భంగా సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ... టాటా భాగస్వామ్యంతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అభివృద్ధి చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ నిర్వహణకు పెట్టుబడులతో పాటు, కార్మికుల పని సామర్థ్యం పెంపు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్మిక సంఘాల నాయకులతోనూ పలు దఫాలుగా చర్చలు కూడా జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు.

=======================

రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో ఒక్క రూపాయి కూడా కొత్తగా పన్ను పెంచలేదని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శాసన సభలో ఈ రోజు చెత్తపన్ను రద్దు బిల్లుపై జరిగిన స్వల్ప చర్చలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేయడం ద్వారా గుత్తేదారులకు లబ్ది చేకూరేలా వ్యవహరించిందని పేర్కొంటూ.. ఈ అంశంపై సమగ్రమైన విచారణ జరిపిస్తామన్నారు. చెత్తపన్నుపై చట్టంలో చేసిన మార్పులను తొలగిస్తూ 1955 మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టంలోని సెక్షన్ 491-ఏను, ఏపీ మున్సిపాల్టీల చట్టం 1965లోని సెక్షన్ 170- బి ను తొలగిస్తూ సవరణ బిల్లును ప్రవేశపెట్టామని సభకు తెలిపారు. కాగా మంత్రి నారాయణ సభలో ప్రతిపాదించిన బిల్లు ఆమోదం పొందింది.

=======================

రాష్ట్రంలో త్వరలో నూతన టెక్స్ టైల్స్ విధానాన్ని తీసుకుని వస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మిగనూరులో టెక్సటైల్స్ పార్కుపై తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు బి.జయనాగేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ... ఎమ్మిగనూరులో టెక్స్ టైల్స్ పార్కు ఏర్పాటు ద్వారా 5 వేల మందికి ఉపాధి కల్పించబోతున్నామని తెలిపారు. అలాగే, రాయదుర్గం, మైలవరం, పామిడిలో టెక్స్ టైల్స్ పార్కులు వస్తాయన్నారు. చీరాలలో హ్యాండ్లూమ్ పార్క్ తో పాటు టెక్స్ టైల్స్ పార్కు నిర్మాణం చేస్తామని వెల్లడించారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత శాలలను నెలకొల్పుతామని తెలిపారు. అదే విధంగా, చేనేత కార్మికులకు 90 శాతం రాయితీపై పనిముట్లని అందిస్తామని మంత్రి సవిత తెలియజేశారు.

విరామం

=======================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ పీఏసీ చైర్మన్ పదవికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ రోజు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తరుపున దాఖలైన నామినేషన్ ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ బలపరచారు. కాగా, పీఏసీ కమిటీలో మొత్తం 12 మంది సభ్యులకు గాను 9 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉంటారు. మొత్తం అన్ని స్థానాలకు ఎన్డీయే కూటమి నుంచి 12 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

=======================

రాష్ట్రంలో ఐటీ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తామని ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ రోజు శాసనసభలో ఆయన మాట్లాడుతూ... విశాఖపట్నంలో ఐటీ పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటోందన్నారు. ఐటీ రంగం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల ఉద్యోగావకాశాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు, విశ్వవిద్యాలయాలు, తెలుగు దేశం ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటయ్యాయని మంత్రి గుర్తు చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

=======================

దేశ రక్షణ కోసం భారత నావికాదళంలో 17 సంవత్సరాల పాటు సేవలందించిన UH3H హెలికాప్టర్ ఇకపై ప్రజల సందర్శనార్థం మ్యూజియంగా మారబోతోంది. విశాఖ బీచ్ రోడ్ లో ఆంధ్ర విద్యాలయం కన్వెన్షన్ సెంటర్ కు సమీపంలో హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను ఇటీవల ప్రారంభించారు. మరో 20 రోజుల్లో ఈ మ్యూజియం అందుబాటులోకి వస్తుందని నావికాదళ అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. దీనిపై మరింత సమాచారాన్ని మా ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి సత్యనారాయణ మూర్తి అందిస్తారు.

(వాయిస్ 37 సుకన్లు)

=======================

పార్లమెంటు శీతాకాల సమావేశాలలో పోలవరం ప్రాజెక్టు గురించి ప్రస్తావించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సమావేశం నిర్ణయించిందని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఈ రోజు అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన పార్లమెంటరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశంలో అనుసరించాల్సిన అంశాలపై ఎంపీలకు జగన్మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

=======================

పాన్-ఇండియా కోస్టల్ డిఫెన్స్ ఎక్సర్‌సైజ్ సీ విజిల్ 4వ ఎడిషన్ విశాఖ సముద్రజలాల్లోఈ రోజు ప్రారంభమైంది. ఆరు మంత్రిత్వ శాఖలు, 21 సంస్థలు, అన్ని తీర ప్రాంత రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలలో, సీ విజిల్ నిర్వహిస్తున్నారు. తీర ప్రాంత జనాభాతో సహా ఓడరేవులు, ఆయిల్ రిగ్‌లు, సింగిల్ పాయింట్ మూరింగ్‌లు, కేబుల్ ల్యాండింగ్ పాయింట్లు, ఇతర కీలకమైన తీర మౌలిక సదుపాయాల వంటి జాతీయ ఆస్తుల భద్రతను బలోపేతం చేసేదిశగా సీ-విజిల్ విన్యాసాలను నావికాదళ అధికారులు నిర్వహిస్తున్నారు. సముద్ర భద్రత గురించి తీర ప్రాంత వర్గాల్లో అవగాహన పెంచడం కూడా దీని ప్రధాన లక్ష్యం. దేశం యొక్క మొత్తం సముద్ర భద్రతకు ఇది ఎంతో ముఖ్యమైనదిగా అధికారులు పేర్కొన్నారు.

=======================

హిందూ మహాసముద్రం, సుమత్రా కోస్తా తీరం దానిని ఆనుకుని ఉన్న దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 23న తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇది తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి రానున్న రెండు రోజులలో దక్షిణ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొన్నారు.

=======================

విజయవాడలో లేపాక్షి గాంధీ శిల్ప్ బజార్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రదర్శనను రాష్ట్ర మంత్రులు ఎస్.సవిత, సత్యకుమార్ యాదవ్, ప్రారంభిస్తారని వెల్లడించింది. రేపటి నుండి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న గాంధీ శిల్ప్ బజార్ లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను దాదాపు 100 స్టాళ్ల ద్వారా ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

=======================
=======================